సాక్షి
వరంగల్
శుక్రవారం । 15 । సెప్టెంబర్ । 2023



వరంగల్‌కు ఘన చరిత్ర
హైదరాబాద్ కంటే వరంగల్‌కు ఘన చరిత్ర ఉందని చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు.
- IIలో▸



కార్గో.. కాస్ట్‌లీ..
టీఎస్ ఆర్టీసీ కార్గో పార్సిల్ సేవలు వినియోగదారులకు భారంగా మారుతున్నాయి.
- IIలో▸

గరిష్టం/కనిష్టం
28^0/24^0
వాతావరణం
జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఉరుములు, మెరుపులతో చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రాంపూర్‌కు రాష్ట్రస్థాయి అవార్డు



నల్లబెల్లి : స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2023లో భాగంగా మండలంలోని రాంపూర్ గ్రామపంచాయతీకి రాష్ట్రస్థాయి అవార్డు వచ్చింది. ఈ మేరకు హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శిక్షణ సంస్థలో గురువారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్‌సుల్తానియా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి డైరెక్టర్ హనుమంతరావు చేతుల మీదుగా సర్పంచ్ చింతపట్ల సురేష్, పంచాయతీ కార్యదర్శి పోతుర్ల రంజిత్ అవార్డు అందుకున్నారు. డీఆర్‌డీఓ సంపత్‌రావు, ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఎంపీఓ కూచన ప్రకాశ్, ఎస్‌బీఎం కోఆర్డినేటర్ శ్రీనివాస్ పాల్గొన్నారు. సర్పంచ్, కార్యదర్శిని జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, ఎంపీపీ ఊడుగుల సునీత తదితరులు అభినందించారు.

నేడు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రాక

హన్మకొండ: కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి శుక్రవారం హనుమకొండ జిల్లా పర్యటనకు రానున్నారు. తెలంగాణ విమోచన దినాన్ని పురస్కరించుకుని చేపట్టిన ద్విచక్ర వాహన ర్యాలీలో భాగంగా ఆయన జిల్లాకు వస్తున్నారు. శుక్రవారం ఉదయం 7.40 గంటలకు సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో అమరుల చిత్రపటానికి కిషన్‌రెడ్డి, పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పిస్తారు. అనంతరం 8 గంటలకు ద్విచక్రవాహన ర్యాలీ ప్రారంభమవుతంది. బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జ్ ప్రకాశ్ జవదేకర్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తారు. హబ్సిగూడ, ఘట్‌కేసర్, భువనగిరి, ఆలేరు మీదుగా ఉదయం 11.30 గంటలకు జనగామకు చేరుకుంటుంది. ఇక్కడి నుంచి రఘునాథపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్ మీదుగా మధ్యాహ్నం 2.50 గంటలకు హనుమకొండలోని తెలంగాణ అమరవీరుల స్థూపం కూడలిలో కిషన్‌రెడ్డి ద్విచక్ర వాహన ర్యాలీగా చేరుకుంటారు. అమరవీరులకు నివాళులర్పించి ఇక్కడి నుంచి బయల్దేరి సాయంత్రం 4.30 గంటలకు పరకాల అమరధామానికి ర్యాలీగా చేరుకుంటారు. అక్కడ అమరవీరులకు నివాళులర్పించి సాయంత్రం 4.40 గంటలకు జరిగే బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు.

ప్రభుత్వ భూమిలో గుడిసెలు



వర్ధన్నపేట : కడారిగూడెం గ్రామంలోని ప్రభుత్వ భూమిలో గురువారం ఇళ్లు లేని దళితులు గుడిసెలు వేసుకున్నారు. 115, 116, 117 సర్వేనంబర్లలో ఉన్న సుమారు 22 ఎకరాల ప్రభుత్వ భూమిలో 50 కుటుంబాలకు పైగా గుడిసెలు వేసుకున్నాయి.

విద్యుత్ మోటార్ల చోరీ

సంగెం: వ్యవసాయబావులు, ఎస్సారెస్పీ కెనాల్ వెంట రైతుల విద్యుత్ మోటార్లను చోరీ చేస్తున్నారు. నార్లవాయి గ్రామానికి చెందిన దామెర కిశోర్‌కు రాళ్లకుంట చెరువు కింద ఎకరం భూమి ఉంది. అందులో వరి సాగు చేశాడు. వరి పంట కోసం ఎస్సారెస్పీ కెనాల్ బ్రిడ్జి వద్ద విద్యుత్ మోటారు పెట్టుకుని నీళ్లు పారిస్తున్నాడు. ఈ నెల 12న మధ్యాహ్నం నీళ్లు పారిస్తుండగా కరెంట్ పోవడంతో ఇంటికి వెళ్లాడు. తిరిగి 13న వెళ్లి మోటారు ఆన్ చేయడానికి వెళ్లే సరికి రూ.10 వేల విలువైన మోటారును దొంగలు ఎత్తుకెళ్లారు. గత జూన్, జూలైలో అదే గ్రామానికి చెందిన ఆకుల కుమారస్వామి, బర్ల ఎల్లయ్య, తాడెం స్వామి, మాదినేని కోటి మోటార్లు సైతం చోరీ చేశారు. తిమ్మాపూర్, గాంధీనగర్, కుంటపల్లి గ్రామాల్లోను ఎస్సారెస్పీ కెనాల్ గట్టుకు పెట్టిన పదుల సంఖ్యలో విద్యుత్ మోటార్లు చోరీకి గురైనట్లు రైతులు తెలిపారు. దామెర కిశోర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.భరత్ తెలిపారు.

19న సామాజిక న్యాయంపై సదస్సు

వరంగల్ చౌరస్తా: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతోందని, వారిలో చైతన్యం కలిగించేందుకు ఈ నెల 19న హనుమకొండలోని హోటల్ హరిత కాకతీయలో సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సదస్సుకు మాజీ మంత్రి ఈటల రాజేందర్, కత్తి వెంకటస్వామి తాడూరి శ్రీనివాస్, రిటైర్డ్ ప్రొఫెసర్లు కె.వెంకట్‌నారాయణ, అన్వర్ ఖాన్, కేయూ జాక్ నాయకులు, తదితరులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

కాంట్రాక్టర్ల కల్పతరువు కోనారెడ్డి చెరువు

- మూడేళ్ల క్రితం గండి.. ఇంకా పూర్తికాని మరమ్మతులు
- రూ.13.56 కోట్లు నిధులున్నా నాసిరకం పనులే..
- అధికారులు దృష్టిసారిస్తేనే నాణ్యతకు అవకాశం
- ఆరుసార్లు పంటలను కోల్పోయిన ఆయకట్టు రైతులు



నాణ్యత లేకుండా చేపట్టిన మత్తడి నిర్మాణ పనులు

సాక్షి, వరంగల్/వర్ధన్నపేట : వర్ధన్నపేట పట్టణ పరిధిలోని కాకతీయుల కాలం నాటి కోనారెడ్డి చెరువు కాంట్రాక్టర్లకు కల్పతరువుగా మారింది. మూడేళ్ల క్రితం పడిన గండి మరమ్మతు కోసం గతేడాది జూన్‌లో రూ.13.56 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ ఏడాది జూన్‌లోనే పనులు పూర్తి కావాల్సి ఉండగా ఇంకా కాలేదు. ఇటీవల కురిసిన వర్షాలతో వరద ప్రవాహం పెరిగి చెరువు కట్ట తెగే ప్రమాదం ఏర్పడడంతో ఏకంగా మత్తడి రాతికట్టడాన్ని కూకటి వేళ్లతో పెకిలించారు. పనులు ఇప్పటివరకు పూర్తికాకపోవడంతో చెరువుపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడిన రైతులు, మత్స్యకారుల పరిస్థితి దయనీయంగా ఉంది. దాదాపు 600 ఎకరాల విస్తీర్ణంలో ఉండే ఈ చెరువు కింద రెండు వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఖరీఫ్, రబీలో నాలుగు వేల ఎకరాలకుపైగానే పంటలు సాగవుతాయి. ఎప్పటికప్పుడు పటిష్టమైన మరమ్మతులు చేస్తే చెరువుకు మూడేళ్ల క్రితం గండి పడేదే కాదు. ప్రతి ప్రభుత్వంలో మరమ్మతుల పేరుతో రూ.కోట్లు వెచ్చించి కేవలం రూ.లక్షల్లో సైతం పనులు చేయకపోవడంతో ఈ దుస్థితి నెలకొందని రైతులు ఆరోపిస్తున్నారు.

నాణ్యతలేని మెటీరియల్‌తో పనులు..

సీసీ పనుల్లో నాణ్యమైన గోదావరి ఇసుకను వినియోగించాల్సి ఉంది. మట్టితో కలిసిన ఇసుకతోపాటు అధికంగా డస్ట్‌ను కలిపి చౌక ధరకు లభించే సిమెంట్‌తో పనులు చేస్తున్నారన్న విమర్శలున్నాయి. రివిట్‌మెంట్ బాగా ఉంటేనే కట్ట పటిష్టంగా ఉంటుంది. కేవలం చెరువులోనే ఉన్న బండరాయిని పగులగొట్టి కట్టకు రివిటింగ్ పనులు చేయడంతో పటిష్టతపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గండిపడిన చోట పూర్తిస్థాయిలో కట్ట లెవల్ చేయకపోవడంతో ప్రమాదం పొంచి ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కాంక్రీట్ పనులు నాణ్యత లేకుండా చేపడుతున్నారని విమర్శలు వస్తున్నాయి.



సిమెంట్, ఇసుకలో ఉపయోగిస్తున్న డస్ట్

అంతా కాంట్రాక్టర్ల కనుసన్నల్లోనే..

చెరువు మరమ్మతు పనులపై నీటి పారుదల ఇంజనీరింగ్ శాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడిందని విమర్శలున్నాయి. కేవలం కాంట్రాక్టర్ల పర్యవేక్షణలోనే పనులు జరుగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. అధికార పార్టీ నాయకులు అండగా ఉండగా తమకు ఏమి కాదనే ధీమాలో వారు ఉన్నారని పేర్కొంటున్నారు. దీంతో చెరువులో నీరు లేకపోవడంతో మూడు సంవత్సరాల్లో ఆరు పంటలను కోల్పోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యవేక్షించి పనులు నాణ్యతతో జరిగేలా చూడాలని అన్నదాతలు కోరుతున్నారు.



కట్టపై పోసిన చెరువు మట్టి, మొరం

మూడేళ్లుగా పంటలు లేవు..



ప్రతి ఏటా రెండుసార్లు వేసే పంటలు.. చెరువులో నీరు లేకపోవడంతో మూడేళ్ల నుంచి పంటలు పండని పరిస్థితి ఉంది. కట్ట పనుల్లో నాణ్యతా లోపం కనిపిస్తోంది. మత్తడిని తవ్వడంతో చెరువు కట్టకు ప్రమాదం పొంచి ఉంది. నక్కల తూము నుంచి మత్తడి వరకు మట్టి లెవల్‌గా ఉండడంతో పటిష్టంగా ఉండేది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఈ మట్టిని అక్రమంగా తవ్వి తరలించడంతో ఇప్పుడు ప్రమాదకరంగా మారింది.

\- బొంపెల్లి దేవేందర్‌రావు, రైతు, వర్ధన్నపేట

కాంట్రాక్టర్ కోసమే ఈ పనులు..



కాంట్రాక్టర్, అధికార పార్టీ నేతల ఆదాయానికే నిధులు మంజూరు చేసినట్లు ఉంది. మంజూరైన నిధుల్లో కేవలం రూ. 3 కోట్ల నుంచి రూ.4 కోట్ల పనులే చేసినట్లు కనిపిస్తోంది. పనుల్లో నాణ్యతలేకుండా పోయింది. మత్తడిని తవ్వడం వల్ల చెరువు కట్టకు ప్రమాదం పొంచి ఉంది. మత్తడి నిర్మాణం, రివిట్‌మెంట్ పటిష్టంగా చేయడం లేదు. ఈ నాణ్యతలేని పనులపై అధికారులు సమగ్ర విచారణ జరిపించాలి.

\- కొండేటి సత్యం, రైతు, వర్ధన్నపేట

ఎవరు కావాలో తేల్చుకోండి!

- బీజేపీ, కాంగ్రెస్ దొందూ దొందే
- బీఆర్‌ఎస్‌తోనే సుస్థిర పాలన
- పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి
- మూడు గ్రామాల్లో రైతులకు పంట నష్టపరిహారం చెక్కుల పంపిణీ



వంచనగిరిలో పంట నష్టపరిహారం చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

గీసుకొండ : 'రాష్ట్రంలో మూడు గంటల కరెంట్ చాలన్న కాంగ్రెస్ కావాలా, బావుల కాడ మోటార్లకు మీటర్లు పెట్టాలన్న బీజేపీ కావాలా.. రైతులను, పేదలను అన్ని రకాలుగా ఆదుకుంటున్న బీఆర్‌ఎస్ కావాలో మీరే తేల్చుకోండి' అని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. వంచనగిరి, శాయంపేటహవేలి, ఊకల్‌లో గురువారం పంట నష్టపరిహారం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్ దొందూదొందేనని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజలు కోరకుండానే సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. మరోమారు అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తారన్నారు. జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు, ఎంపీడీఓ వీరేశం, ఎంపీఓ ప్రభాకర్, ఏఓ హరిప్రసాద్ బాబు, సర్పంచ్‌లు రాజబోయిన రజిత, మొగసాని నాగదేవత, ఎంపీటీసీ వీరారావు, బీఆర్‌ఎస్ నాయకులు వీరగోని రాజ్‌కుమార్, ముంత రాజయ్య, కొల్పుల కట్టయ్య, బొమ్మగాని శ్రీను, మాజీ సర్పంచ్ కొంగర చంద్రమౌళి పాల్గొన్నారు.

వంచనగిరి నిధుల ఖర్చుపై ఆగ్రహం..

వంచనగిరి గ్రామపంచాయతీలో రూ.11 లక్షల నిధులున్నా ఎందుకు ఖర్చు చేయడం లేదని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేరే గ్రామాల్లో నిధులు లేక సర్పంచ్‌లు ఇబ్బందులు పడుతున్నారని, నిధులున్నా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. మిషన్ భగీరథ నల్లా నీటి కోసం నిధులు ఖర్చు చేయాలని, గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఎంపీఓను ఆయన ఆదేశించారు.

సీఎం మంజూరు చేసిన నిధులను దారిమళ్లించిన ఎమ్మెల్యే

వంచనగిరి గ్రామాభివృద్ధికి అప్పటి ఎమ్మెల్సీ కొండా మురళి విజ్ఞప్తి మేరకు సీఎం కేసీఆర్ రూ.10 కోట్ల నిధులు మంజూరు చేస్తే.. అందులో సుమారు రూ.6 కోట్లను ఎమ్మెల్యే దారి మళ్లించారని కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు ఆరోపించారు. మహిళా భవనాల నిర్మాణాలకు నిధులు మళ్లించి ఎమ్మెల్యే చల్లా తమ గ్రామానికి మొండిచేయి చూపారని విమర్శించారు. వంచనగిరిలో పంట నష్టపరిహారం చెక్కుల పంపిణీ చేసిన అనంతరం పలువురు కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు విలేకరుతో మాట్లాడారు. నష్టపోయిన రైతులకు కాకుండా బీఆర్‌ఎస్ నాయకులకు పంట నష్టపరిహారం ఇచ్చారని తెలిపారు. గృహలక్ష్మి ఇళ్లు పేదలకు కాకుండా కేవలం బీఆర్‌ఎస్ వారికే ఇస్తామని ఎమ్మెల్యే చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటి వరకు గ్రామానికి ఎమ్మెల్యే పెద్దగా నిధులు ఇచ్చిన ఆధారాలు లేవన్నారు. ఎమ్మెల్యే తమ గ్రామానికి చేసిందేమీ లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీటీసీ భర్త నాగనబోయిన సారంగం, కాంగ్రెస్ నాయకులు అమిరిశెట్టి రాజు రంపీస రంజిత్, కాల్వ వేణు, కుప్పాల గోపాల్, హన్మంతు, మధుసూదన్, మీరుపల్లి సురేశ్, సారంగం, రాజు పాల్గొన్నారు.

'టెట్'కు పకడ్బందీ ఏర్పాట్లు

- 20 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ
- పేపర్–1కు 4,780 మంది, పేపర్–2కు 4,267 మంది అభ్యర్థులు
- డీఈఓ వాసంతి వెల్లడి

కాశోజీ సెంటర్ : జిల్లాలో శుక్రవారం నిర్వహించనున్న టెట్‌కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఈఓ వాసంతి గురువారం తెలిపారు. ఇందుకోసం 20 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉదయ 9–30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే పేపర్–1కు 4,780 మంది, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే పేపర్–2కు 4,267 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని వివరించారు. పరీక్షల నిర్వహణ కోసం 20 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 20 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, ఐదుగురు రూట్ ఆఫీసర్స్, ఫ్లయింగ్ స్క్వాడ్స్ అధికారులను నియమించినట్లు తెలిపారు. వివరాలకు 9948625186 నంబర్‌లో సంప్రదించాలని డీఈఓ సూచించారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

- పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్

కాజీపేట: కుల, మతాలకతీతంగా పండుగలను ప్రజలంతా ప్రశాంతగా జరుపుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ అన్నారు. హనుమకొండ ములుగు రోడ్డులోని వెంకటేశ్వర గార్డెన్స్‌లో గురువారం సెంట్రల్ జోన్ పోలీసుల ఆధ్వర్యంలో వినాయక చవితి, మిలాద్–ఉన్–నబీ పండుగలను పురస్కరించుకుని శాంతి పరిరక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ట్రైసిటీకి చెందిన వివిధ మతాల పెద్దలతో పాటు గణేశ్ మండపాల నిర్వాహకులకు శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకునేలా దిశానిర్దేశం చేశారు. డీసీపీ ఎంఏ.బారి, ఏసీపీలు బోనాల కిషన్, డేవిడ్ రాజ్, జితేందర్‌రెడ్డి, భోజరాజు, భద్రకాళి శేషు, గంగు ఉపేంద్ర శర్మ, ఖుస్రూపాషా, దర్శన్‌సింగ్, సామ్యూల్, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొరుగు రాష్ట్రాల పోలీసులతో సమన్వయం ఉండాలి

పోలీసు అధికారులు ఇతర రాష్ట్రాల పోలీసులతో సమన్వయం చేసుకుంటూ సమర్థవంతంగా పని చేస్తే నేరాల నియంత్రణ సులువవుతుందని సీపీ ఏవీ.రంగనాథ్ అన్నారు. గురువారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధి సమావేశ మందిరంలో ఇటీవల జరిగిన వరుస అపార్ట్‌మెంట్లలో చోరీలకు పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పట్టుకోవడంలో కీలకంగా సహకరించిన ఏపీలోని కర్నూలు పట్టణ పోలీస్ సిబ్బందిని ఘనంగా సన్మానించారు. సీఐ శంకరయ్య, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, నాగరాజుకు శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో క్రైం డీసీపీ దాసరి మురళీధర్, ఏసీపీ మల్లయ్య, ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, సూర్యప్రసాద్, శంకర్ నాయక్, కరుణాకర్ పాల్గొన్నారు.



గణపతి ఉత్సవాల పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సీపీ ఏవీ.రంగనాథ్

జనాలకు చేరువగా 'జనరిక్'

- సహకార సంఘాల ఆధ్వర్యంలో జనరిక్ మెడికల్ షాపులు
- ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వ నిర్ణయం
- జిల్లాలో ఐదు మండలాల ఎంపిక
- సొసైటీలకు పెరగనున్న ఆదాయం

ఖానాపురం: రైతుల సంక్షేమానికి అనేక విధాలుగా సహకార సంఘాలు ఉపయోగపడుతున్నాయి. వీటి ద్వారా ప్రజలకు మరిన్ని సేవలందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సహకార సంఘాల సమక్షంలో జనరిక్ మందులను అందించేందుకు చర్యలు చేపడుతోంది. ఇందుకు సంబంధించి కేంద్రం నుంచి ఆదేశాలు రావడంతో అధికారులు నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించారు. వరంగల్ జిల్లా వ్యాప్తంగా 29 సహకార సంఘాలున్నాయి. వీటి ద్వారా రైతులకు రుణాలందించడం, ధాన్యం కొనుగోళ్లు, ఎరువుల విక్రయం వంటి సేవలు అందుతున్నాయి. ఇలా పలు రకాల వ్యాపారాలు చేస్తూ.. సహకార సంఘాలు ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నాయి.



ఖానాపురం సహకార సంఘం కార్యాలయం

తక్కువ ధరలకే మందులు..

సహకార సంఘాల ఆధ్వర్యంలో జనరిక్ షాపులు ఏర్పాటు చేస్తే.. గ్రామీణులకు తక్కువ ధరకే మందులు అందనున్నాయి. జనరిక్ మందులను పేదలకు మరింత చేరువ చేసేందుకు సహకార సంఘాలు దోహదపడనున్నాయి. అంతేకాకుండా ఆదాయం కూడా సమకూరనుంది. పలువురికి ఉపాధి అవకాశాలు సైతం లభించే అవకాశం ఉంది. కాగా.. దుకాణాల నిర్వహణ, తదితర మార్గదర్శకాలు అధికారులకు ఇంకా అందలేదని సమాచారం.

ఐదు మండలాల ఎంపిక..

సహకార సంఘాల్లో జన్ ఔషధి షాపులను ఏర్పాటు చేయాలని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. షాపుల ఏర్పాటు కోసం ఆసక్తి గల సంఘాల నుంచి ప్రతిపాదనలు పంపాలని రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల నుంచి జిల్లా అధికారులకు ఆదేశాలు అందాయి. జిల్లా సహకార అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. ఇందులో భాగంగా వరంగల్ జిల్లాలోని ఖానాపురం, నల్లబెల్లి, ఊకల్, చెన్నారావుపేట, ఖిలా వరంగల్‌లోని సహకార సంఘాలను ఎంపిక చేసి నివేదికలు పంపినట్లు జిల్లా అధికారులు తెలిపారు.

నివేదికలు పంపాం..

సహకార సంఘాల్లో జనరిక్ షాపుల ఏర్పాటు ప్రతిపాదనలు పంపాలని ఆదేశాలు వచ్చాయి. దీంతో జిల్లాలోని ఐదు మండలాలను ఎంపిక చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పది రోజుల క్రితం నివేదికలు పంపించాం. షాపుల ఏర్పాటు చేస్తే జనరిక్ మందులు గ్రామీణులకు అందుబాటులోకి వస్తాయి. ప్రజలు వీటిని వినియోగించుకోవాలి.

\- సంజీవరెడ్డి, డీసీఓ, వరంగల్

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- ఏసీపీ రఘుచందర్

వర్ధన్నపేట : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని వర్ధన్నపేట ఏసీపీ రఘుచందర్ సూచించారు. పట్టణంలోని వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై ఏసీపీ రఘుచందర్ ఆధ్వర్యంలో గురువారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. వేగ నియంత్రణ కలిగి ఉండాలని, పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో తీసుకెళ్లొద్దని పేర్కొన్నారు. వాహనాల వెంట ఆర్‌సీ, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ ఉంచుకోవాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై ప్రవీణ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

బదిలీల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలి

- టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న కడారి భోగేశ్వర్

రాయపర్తి : ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ డిమాండ్ చేశారు. మండలంలోని తెట్టెకుంటతండా, తిర్మలాయపల్లి, కొండూరు, కాట్రపల్లి, మొరిపిరాల, మైలారం, రాయపర్తి తదితర పాఠశాలల్లో టీపీటీఎఫ్ రాష్ట్ర మహాసభల సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న బదిలీలకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని తెలిపారు. బదిలీల్లో తలెత్తిన సమస్యలను విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయ సంఘాల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. చిన్నచిన్న అంశాలపై కోర్టును ఆశ్రయించకుండా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియకు ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. ప్రతీ మండలానికి ఎంఈఓ పోస్టును మంజూరు చేసి భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడవెల్లి వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు బందుగు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎం.సతీష్, సుధీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య



మాట్లాడుతున్న జి.నాగయ్య

నర్సంపేట : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని ఐఎంఏ హాలులో సీపీఎం పట్టణ కార్యదర్శి హన్మకొండ శ్రీధర్ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ 1945 నుంచి 1951 వరకు వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం కొనసాగిందని గుర్తుచేశారు. ఆ క్రమంలో నెహ్రూ సైన్యం, నైజాం ప్రభుత్వ పోలీసు దౌర్జన్యాలకు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు నాలుగు వేల మంది మృతి చెందారన్నారు. ఆ పోరాటం ద్వారా తెలంగాణలో 10 లక్షల ఎకరాల భూములను సాధించుకొని పేదలకు పంచినట్లు తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి చింతమల్ల రంగయ్య మాట్లాడుతూ ఆంగ్లేయులు, నిజాం, దేశ్‌ముఖ్‌లకు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చేశారని, దాని ఫలితంగానే హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైందని వివరించారు. చరిత్రను బీజేపీ వక్రీకరించే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. ఢిల్లీలో జరిగిన జీ–20 అంతర్జాతీయ సదస్సులో 'విద్వేషాలు వద్దు' అనే తీర్మానాన్ని ప్రధాని మోదీ ప్రవేశపెట్టి ఆమోదించుకున్నారని ఎద్దేవా చేశారు. సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్య సమ్మయ్య, ముంజాల సాయిలు, అనంతగిరి రవి, గడ్డమీది బాలకృష్ణ, కందికొండ రాజు, కుదురుపాక రాములు, మద్ది అశోక్, ఎండీ.ఫరీదా, వజ్జంతి విజయ, జగన్నాథం, కార్తీక్, బిట్ర స్వప్న, ఉదయగిరి నాగమణి, తాళ్లపల్లి ప్రవళిక, గనిపాక ఇంద్ర, బి.లక్ష్మి, కలకోటి అనిల్, గనిపాక విలియంకేరి పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ప్రసవాలు పెంచాలి

నెక్కొండ : పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య పెంచాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ పద్మశ్రీ అన్నారు. నెక్కొండ పీహెచ్‌సీని గురువారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ మేరకు పీహెచ్‌సీలో పలు రికార్డులను పరిశీలించి, వైద్య సిబ్బంది పనితీరును తెలుసుకున్నారు. అనంతరం పీఓ మాట్లాడుతూ గర్భిణులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సీజన్ వ్యాధులపై అప్రమత్తగా ఉండాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి రోహెలా తన్వీర్, పీహెచ్‌ఎన్‌లు అరుణ, విజయ, సూపర్‌వైజర్ వరమ్మ, హెల్త్ అసిస్టెంట్ రవిచందర్‌రెడ్డి, సిబ్బంది, స్టాఫ్ నర్సు శారద తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సేవలందించాలి

సంగెం : వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ గర్భిణులకు సేవలందించాలని ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పద్మశ్రీ అన్నారు. గురువారం మండలంలోని గవిచర్ల పల్లెదవాఖానను సందర్శించారు. ఈ సందర్భంగా గర్భిణులకు అందుతున్న సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు తీసుకోవాల్సిన ఆహారం, జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పల్లె దవాఖాన డాక్టర్ క్రాంతికుమార్, సీహెచ్‌ఓ చిన్నాబాయి, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.



నెక్కొండ : పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న ప్రాజెక్టు ఆఫీసర్ పద్మశ్రీ

దర్గాకు భక్తజనం..

కాజీపేట హజరత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబానీ దర్గా ఉత్సవాలకు భక్తజనం పోటెత్తింది. రెండో రోజు గురువారం వివిధ రాష్ట్రాల నుంచి దర్గాల పీఠాధిపతులు, ముస్లిం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దర్గా వద్ద పూలు, చాదర్లు సమర్పించి ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, అరూరి రమేశ్, జిల్లా అధికారులు దర్శించుకుని గిలాఫ్, చాదర్ సమర్పించారు. – కాజీపేట రూరల్



- వివరాలు IVలో▸

కేయూలో క్షుద్రపూజలు !



ఘటనా స్థలిలో కొబ్బరికాయ, అగర్ బత్తీలు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ లోని ప్రతాపరుద్ర హాస్టల్ వెనక భాగంలో దుండగులు క్షుద్రపూజలు చేసినట్లు తెలుస్తోంది. చేతబడి పూజలుగా భావిస్తున్నారు. మట్టితో బొమ్మను తయారు చేసి అక్కడ కొబ్బరి కాయలు కొట్టి ఉన్నాయి. పలువురు విద్యార్థులు సీతాఫలాలు తెంపుకునేందుకు ఆ హాస్టల్ వెనక భాగంలోనికి వెళ్లగా అక్కడ క్షుద్రపూజలు కనిపించాయి. దీంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ప్రతాపరుద్రహాస్టల్ కొంతకాలం క్రితం శిథిలావస్థకు చేరుకోగా దానిని మూసివేశారు. ఆ ప్రాంతంలో అంతగా సంచారం ఉండదు. దీంతో దుండగులు క్షుద్ర పూజలు చేసి ఉంటారని భావిస్తున్నారు. ఈ ఘటనను చూసినవారు వీడియో తీసి గురువారం సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వైరలైంది.

నేడు ఆర్టీసీ ఐటీఐలో స్పాట్ అడ్మిషన్లు

హన్మకొండ: టీఎస్ ఆర్టీసీ ఐటీఐలో ప్రవేశానికి ఈ నెల 15న స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు ఆ ఐటీఐ ప్రిన్సిపాల్ వంగాల మోహన్ రావు తెలిపారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్న, చేసుకోని విద్యార్థులు ఈ స్పాట్ అడ్మిషన్ పొందవచ్చని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, వెల్డర్, పెయింటర్ ట్రేడ్‌లలో ఖాళీలున్నాయని వెల్లడించారు. డీజిల్ మెకానిక్, వెల్డర్ ఒక సంవత్సరం, మోటార్ మెకానిక్ రెండు సంవత్సరాల కోర్సు అని తెలిపారు. పెయింటర్ రెండు సంవత్సరాల కోర్సు అని తెలిపారు. ఇదే చివరి అవకాశమని విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. అడ్మిషన్ కోసం వరంగల్ ములుగు రోడ్డులోని ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీలోని ఐటీఐలో సంప్రదించాలని కోరారు. వివరాలకు 98494 25319, 80081 36611 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

కార్గో.. కాస్ట్‌లీ..



హనుమకొండ జిల్లా బస్ స్టేషన్‌లోని కార్గో, పార్సిల్ కేంద్రం

ప్రైవేట్ ఏజెన్సీలతో నిర్వహణ
- వినియోగదారులపై ఆర్థిక భారం
- పార్సిల్ చేసినా, తీసుకున్నా చార్జీల వసూలు..
- కేంద్రాల వద్ద అసౌకర్యాలు
- ఇబ్బందులు పడుతున్న వైనం
- సేవలపై మిశ్రమ స్పందన

హన్మకొండ : టీఎస్ ఆర్టీసీ కార్గో, పార్సిల్ సేవలు భారంగా మారుతున్నాయి. తక్కువ చార్జీలతో సత్వరమే పార్సిల్ చేరుతుందని భావించిన వినియోగదారులకు నిరాశే ఎదురవుతుతోంది. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాల ద్వారా ఆదుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా 2020 జూన్ 19న కార్గో, పార్సిల్ సేవలు ప్రారంభించింది. మొదట్లో ఆర్టీసీ ఉద్యోగులతోనే స్వయంగా కార్గో, పార్సిల్ సేవలు సేవలు అందించింది. అనంతరం ప్రైవేట్ వ్యక్తుల ద్వారా (లీజ్) నిర్వహిస్తుండడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రైవేట్ ఏజెన్సీల చేతుల్లోకి వెళ్లినప్పటి నుంచి కార్గో, పార్సిల్ సేవలు ఆర్థిక భారంగా మారాయని వినియోగదారులు మండిపడుతున్నారు. అంతకు ముందు పార్సిల్ బుక్ చేసిన సమయంలోనే చార్జీలు తీసుకుని ఉచితంగా చేరవేసేవారు. ప్రైవేట్‌కు అప్పగించిన అనంతరం పార్సిల్ బుక్ చేసిన సమయంలో, పార్సిల్ రిసీవర్‌కు అందించే సమయంలో రెండు విధాలా చార్జీలు తీసుకుంటుండడంతో భారం పెరిగింది. పార్సిల్ చేరుకున్న మూడు రోజుల వరకు ప్రతి పార్సిల్‌కు రూ.10 చొప్పున తీసుకుని అందజేస్తున్నారు. మూడు రోజులు దాటినా పార్సిల్ తీసుకెళ్లని పక్షంలో మూడో రోజు నుంచి 7వ రోజు వరకు రోజుకు రూ.10 చొప్పున, 7వ రోజు తర్వాత ప్రతి రోజు రూ.25 చొప్పున వసూలు చేస్తున్నారు. 30 రోజుల తర్వాత పార్సిల్ తీసుకెళ్లని పక్షంలో సంబంధిత వ్యక్తులు, సంస్థలకు సమాచారం ఇచ్చి 40 రోజులకు వేలం వేస్తారు.

పార్సిల్ నిర్ణీత విలువ కంటే విధించే చార్జీలు అధికం..

పార్సిల్ స్వీకరించాల్సిన వ్యక్తులు అందుబాటులో లేని సమయంలో పార్సిల్ నిర్ణీత విలువ కంటే విధించే చార్జీలు అధికమవుతుండడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇది ఇలాగే కొనసాగితే ఆర్టీసీ పార్సిల్ ఆదరణ కోల్పోయే ప్రమాదం ఉందని పరిశీలకులు తెలిపారు. వరంగల్ రీజియన్‌లోని 9 డిపోల పరిధిలో 67 కార్గో, పార్సిల్ సేవలు అందిస్తుండగా ఇందులో వరంగల్ బస్ స్టేషన్‌లోని కేంద్రం మినహా మిగతా 66 కేంద్రాలు ప్రైవేట్ ఏజెన్సీల ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. అయితే పార్సిల్ కేంద్రాల్లో సౌకర్యాలు లేవని వినియోగదారులు తెలిపారు. బరువు ఉన్న వస్తువులు వచ్చినప్పుడు ఇబ్బందులు పడాల్సి వస్తోందని వారు చెప్పారు. హమాలీలు లేకపోవడం, వాహనాలు సమీపానికి వచ్చే సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. పార్సిల్ కేంద్రంలో సౌకర్యాలు కల్పించాలని కోరారు. కాగా, పార్సిల్ సేవపై వినియోగదారుల నుంచి మిశ్రమ స్పందన వచ్చింది. సేవలు భాగున్నాయని, చెబుతూనే పార్సిల్ తీసుకుంటున్నప్పుడు విధించే చార్జీల విధానాన్ని తప్పుబట్టారు. హ్యాండిలింగ్ చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆర్టీసీ ఆధ్వర్యంలోనే బాగుండేది



కార్గో, పార్సిల్ సేవలను ఆర్టీసీ నిర్వహించినప్పుడే బాగుంది. ప్రైవేట్‌కు అప్పగించిన తర్వాత అదనపు చార్జీలు వేసి భారం మోపుతున్నారు. పార్సిల్ తీసుకునే సందర్భంగా రూ.10 తీసుకోవడం వల్ల ఆర్థిక భారం పడుతోంది.

– గర్రెపల్లి అజయ్, కాశిబుగ్గ, జేసీబీ స్పేర్ పార్ట్స్ ఇన్‌చార్జ్

హమాలీల సమస్య ఉంది



కార్గిల్, పార్సిల్ కేంద్రాల్లో హమాలీల సమస్య ఉంది. పెద్ద పార్సిల్ వచ్చినప్పుడు వాటిని వాహనాల్లోకి చేర్చడం ఇబ్బందిగా ఉంది. వాహనాలు కూడా లగేజీ సమీపానికి వచ్చేలా ఏర్పాట్లు చేయాలి.

– బి.నవీన్, శ్రీరామానుజన్ కాన్సెప్ట్ స్కూల్

సమస్యల పరిష్కారానికి కృషి



కార్గో, పార్సిల్ సెంటర్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం. వినియోగదారులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. హ్యాండ్లింగ్ చార్జీల సమస్య పరిష్కారానికి యాజమాన్యం ఆలోచన చేస్తుంది. త్వరలో సమస్య పరిష్కారమవుతుంది.

– శ్రావణ్, కార్గో రీజియన్ మార్కెటింగ్ హెడ్

వరంగల్‌కు ఘన చరిత్ర



మాట్లాడుతున్న చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్. పక్కన మహమ్మద్ ఇంతియాజ్, మౌలానా యూసుఫ్ జాహేద్

- అన్ని వర్గాల పండుగలను అధికారికంగా నిర్వహిస్తున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమే..
- దర్గా కాజీపేట.. మత సామరస్యానికి ప్రతీక
- చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్

హన్మకొండ: హైదరాబాద్ కంటే వరంగల్‌కు ఘన చరిత్ర ఉందని చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌కు 500 ఏళ్ల చరిత్ర ఉంటే... 2 వేల సంవత్సరాల క్రితం జైనులు సంచరించిన, జైన దేవాలయం నిర్మించిన చరిత్ర, 1100 సంవత్సరాల కాకతీయుల చరిత్ర వరంగల్‌కు ఉందని వివరించారు. ప్రపంచంలో రెండు ప్రఖ్యాతిగాంచిన దర్గాలుంటే అందులో ఒకటి బాగ్దాద్‌లో ఉండగా రెండోది కాజీపేటలో ఉందన్నారు. కాజీపేట దర్గా మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. అన్ని మతాల వారు కాజీపేట దర్గాకు వచ్చి మొక్కులు తీర్చుకుంటారన్నారు. ఈ ఏడాది నుంచి క్యాంపు కార్యాలయం నుంచి చాదర్ తీసుకెళ్లి దర్గాలో సమర్పించనున్నట్లు తెలిపారు. దేశంలో అన్ని పండుగలను అధికారికంగా నిర్వహిస్తున్న రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనన్నారు. రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మహమ్మద్ ఇంతియాజ్, ఖాదీ గ్రామీణ పరిశ్రమల కార్పొరేషన్ చైర్మన్ మౌలానా యూసుఫ్ జాహేద్ మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఒక గాడ్సే అని, ఆ గాడ్సే గాంధీని ఖతం చేస్తే.. ఈ గాడ్సే కాంగ్రెస్‌ను ఖతం చేస్తాడని విమర్శించారు. మైనారిటీలను కాంగ్రెస్ ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుందని విమర్శించారు. మైనారిటీల పేరు ఉచ్చరించే అర్హత రేవంత్ రెడ్డికి లేదన్నారు. సీఎం కేసీఆర్ సెక్యులర్ అని, కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో సెక్యులర్ ప్రభుత్వం అద్భుతంగా పని చేస్తోందన్నారు. కాంగ్రెస్ హయాంలో మైనార్టీ విద్యను పట్టించుకోలేదని, సీఎం కేసీఆర్ ఎస్సీ, ఎస్టీలతో పాటు మైనారిటీల కోసం ప్రత్యేక గురుకులాలు ఏర్పాటు చేసి ఉన్నత విద్యనభ్యసించే అవకాశం కల్పించారని కొనియాడారు. దాస్యం వినయ్ భాస్కర్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. సమావేశంలో 'కుడా' చైర్మన్ సుందర్ రాజ్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ అజీజ్‌ఖాన్, నాయకుడు నయీముద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



రాంకుమార్ (ఫైల్)

ఎస్ఎస్ తాడ్వాయి:రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన గురువారం తాడ్వాయి సమీపంలో జరిగింది. ఎస్సై ఓంకార్ యాదవ్ కథనం ప్రకారం వరంగల్ నుంచి ఏటూరు నాగారం వైపునకు వెళ్తున్న ఓ కారును.. ఏటూరునాగారం వైపు నుంచి వస్తున్న బొలెరో తాడ్వాయి సమీపంలోని ఎత్తిబురు ప్రాంతంలో ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన రాంకుమార్ (40) అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. అలాగే, బొలెరో ప్రయాణిస్తున్న ఇద్దరూ గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను తాడ్వాయి ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. ఘటనపై మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏజెన్సీలో మరణ మృదంగం

- విషజ్వరంతో ఇద్దరు మహిళలు, డెంగీతో ఆరు నెలల పాప మృతి



వాజేడు: కుర్సం రజని (ఫైల్)



వాజేడు: మనీష (ఫైల్)



మినహ (ఫైల్)

వాజేడు/కన్నాయిగూడెం: ములుగు జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లో విషజ్వరాలు మరణ మృదంగం మోగిస్తున్నాయి. రెండు రోజుల్లోనే ఐదుగురు చనిపోయారు. బుధవారం ఇద్దరు చనిపోగా, గురువారం మరో ముగ్గురు మృతిచెందారు. మృతుల్లో ఆరు నెలల పాప ఉండడం గమనార్హం. ములుగు జిల్లా వాజేడు మండలం మొట్లగూడెం గ్రామానికి చెందిన కుర్సం రజని(35) విషజ్వరంతో బుధవారం రాత్రి చనిపోయింది. రజని వారం రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. స్థానిక ఆర్ఎంపీల వద్ద నాలుగు రోజులు వైద్యం చేయించుకున్నా తగ్గలేదు. దీంతో ఏటూరునాగారం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ పరీక్షలు చేసి టైఫాయిడ్‌గా తేల్చారు. మెరుగైన వైద్యం నిమిత్తం ములుగు వెళ్లాలని సూచించడంతో ఏరియా వైద్యశాలకు తీసుకువెళ్లారు. రజని చికిత్స పొందుతూ చనిపోయింది. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మరో మహిళ..

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్‌లో ఉంటున్న మనీష(30) రాఖీ పండుగ సందర్భంగా వాజేడు మండల పరిధిలోని మొరుమూరు కాలనీ గ్రామానికి వచ్చింది. ఆమె ఇక్కడికి జ్వరంతోనే వచ్చింది. స్థానికంగా వైద్యం చేయించుకున్నా తగ్గక పోవడంతో మెరుగైన వైద్యం నిమిత్తం ఖమ్మం తరలించారు. చికిత్స పొందుతూ గురువారం చనిపోయింది. మృతదేహాన్ని ఛత్తీస్‌గఢ్ తీసుకెళ్లినట్లు సమాచారం.

ఆరు నెలల పాప

వాజేడు మండల పరిధిలోని దేవాదుల గ్రామానికి చెందిన ఆరు నెలల పాప డెంగీ జ్వరంతో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన ఎస్‌కే.గౌస్– సహర దంపతుల కుమార్తె మినహ(6నెలలు) డెంగీ జ్వరంతో బాధపడుతూ వారం రోజుల నుంచి ఏటూరునాగారంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. మెరుగైన వైద్యం కోసం హనుమకొండకు తరలించగా గురువారం చనిపోయినట్లు తండ్రి గౌస్ తెలిపారు.

చోరీకి యత్నం.. విఫలం

- హసన్‌పర్తిలో మహిళా దొంగల ముఠా హల్‌చల్
- ఇద్దరు పరార్.. పోలీసుల అదుపులో మరొకరు..



పోలీసుల అదుపులో మహిళా దొంగ

హసన్‌పర్తి: ముగ్గురు మహిళా దొంగల ముఠా చోరీకి యత్నించి విఫలమైంది. ఇంటి యజమాని అప్రమత్తంగా వ్యవహరించడంతో ముఠా పథకం బెడిసికొట్టింది. ఈ ఘటన గురువారం హసన్‌పర్తి మండల కేంద్రంలో జరిగింది. హసన్‌పర్తికి చెందిన కోరె కుమారస్వామి ఇంట్లో చోరీకి ఓ మహిళా దొంగల ముఠా వచ్చింది. ఆ సమయంలో కుమారస్వామి, కోమల దంపతులు ఓ గదిలో ఉన్నారు. ఈ విషయం దొంగలు గుర్తించలేదు. చోరీకి వచ్చిన వారిలో ఒకరు అదే ప్రాంతంలోని పాఠశాల వద్ద, మరొకరు ఇంటి ఆవరణలో.. ఇంకొకరు లోపలికి వెళ్లారు. ఈ క్రమంలో ఇంటి ఆవరణలో శబ్దం వినిపించడంతో యజమాని దంపతులు అప్రమత్తమయ్యారు. బయటకు వెళ్లి చూడగా గుర్తు తెలియని మహిళ కనిపించింది. దీంతో ఎవరూ అంటూ ప్రశ్నిస్తుండగానే కోమలపై దాడికి యత్నించింది. దీంతో తప్పించుకున్న కోమల.. దొంగ దొంగ అంటూ కేకలు వేసింది. ఈ క్రమంలో చోరీకి వెళ్లిన మరో మహిళ భయంతో పరుగులు తీస్తూ కోమల చేతికి చిక్కింది. అప్పటికే మరో ఇద్దరు మహిళలు పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పట్టుబడిన మహిళను అదుపులోకి తీసుకున్నారు. పరారైన వారి వివరాలు సేకరించారు. పరారైన వారు రంగపల్లికి చెందిన వారుగా తెలిసింది. పోలీసుల అదుపులో ఉన్న మహిళ జమ్మికుంటకు చెందినదిగా తెలుస్తోంది. అదుపులో ఉన్న మహిళా దొంగ వేలిముద్రలు సేకరించారు. కరీంనగర్‌తో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలు చోట్ల చోరీలు చేసినట్లు తెలిసింది.

రెవెన్యూ మహిళా ఉద్యోగి ఆత్మహత్య

- రఘునాథపల్లిలో విషాద ఘటన



సంధ్యకిరణ్(ఫైల్)

రఘునాథపల్లి: భర్త దూరంగా ఉండడం, అత్తామామలతో గొడవలు, దూర ప్రాంతంలో విధులతో పనిఒత్తిడి, ఒంటరి తనంతో మనస్తాపం చెందిన ఓ రెవెన్యూ ఉద్యోగిని బలవన్మరణానికి పాల్పడింది. ఈ విషాద ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. లింగాలఘణపురం మండలం నవాబుపేట గ్రామానికి చెందిన సంధ్యకిరణ్ (28).. రఘునాథపల్లి గ్రామానికి చెందిన మానుపాటి శ్రీనివాస్‌ను వివాహం చేసుకుంది. వీరికి కుమారుడు యశ్వంత్, కుమార్తె హర్షిత ఉన్నారు. సంధ్యకిరణ్ నవాబుపేట వీఆర్ఏగా తహసీల్ కార్యాలయంలో పనిచేస్తుండేది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వారిని రెగ్యులరైజ్ చేయగా మేడ్చల్ జిల్లా బండ్లగూడ తహసీల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరింది. నిత్యం రఘునాథపల్లి నుంచి బండ్లగూడకు రాకపోకలు సాగిస్తూ పనిఒత్తిడికి గురయ్యేది. అత్తామామలు మల్లయ్య, అంజమ్మలతో తరచూ గొడవల కారణంగా కొన్నాళ్లుగా సంధ్యకిరణ్ అద్దె ఇంట్లో పిల్లలతో కలిసి నివసిస్తోంది. భర్త శ్రీనివాస్ నాగపూర్‌లో కూలీ పనులు చేస్తున్నాడు. మూడు రోజుల క్రితం శ్రీనివాస్.. భార్య వద్దకు రాకుండా తల్లిదండ్రుల వద్దకు వచ్చాడు. అతని రాక సమాచారం తెలుసుకొని తన వద్దకు ఎందుకు రావడం లేదని, ఇద్దరం కలిసే ఉందామని అడిగినా వినకుండా తిరిగి నాగపూర్‌కు వెళ్లాడు. అప్పటికే జీవితంపై విరక్తి చెందిన సంధ్య గురువారం ఉదయం కుమారుడు, కుమార్తెను ఆటోలో పాఠశాలకు పంపింది. ఇంట్లో దాచి ఉంచిన పురుగుల మందు తాగింది. స్థానికురాలు వచ్చి గుర్తించగా అప్పటికే అపస్మారక స్థితికి చేరుకుంది. వెంటనే జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించింది. తమ కూతురును భర్త, అత్తామామలే పొట్టనబెట్టుకున్నారని తండ్రి ఫిర్యాదు మేరకు ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చాగర్ల రఘుపతి తెలిపారు.

రామకుంటతండాలో వ్యక్తి..

డోర్నకల్: మండలంలోని వెన్నారం జీపీ పరిధిలోని రామకుంటతండాకు చెందిన ఓ వ్యక్తి పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. తండాకు చెందిన బానోత్ రమేష్(38) గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో రమేష్ ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. కాగా, రమేష్ ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం అందినా కుటుంబీకుల నుంచి ఫిర్యాదు అందలేదని డోర్నకల్ సీఐ బి.ఉపేందర్‌రావు తెలిపారు.

తండ్రి మందలించాడని..

- ఆత్మహత్యకు యత్నించిన కూతురు
- చికిత్స పొందుతూ మృతి
- ఆలేరు గ్రామంలో ఘటన

నెల్లికుదురు : తండ్రి మందలించాడనే కోపంలో మనస్తాపం చెందిన ఓ విద్యార్థిని.. గడ్డి నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని గురువారం ఆలేరు గ్రామంలో జరిగింది. ఎస్సై క్రాంతికిరణ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బాద మాధవి, యాకన్న దంపతులకు ఇద్దరు కూతుళ్లు మునీష, వైష్ణవి ఉన్నారు. పెద్దకూతురు మునీష(15) ఆలేరులోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఈ క్రమంలో ఈ నెల 10, 11వ తేదీల్లో స్కూల్‌కు వెళ్లలేదు. దీంతో వ్యవసాయ పనులకు రావాలని తండ్రి కోరగా నిరాకరించింది. దీనిపై తండ్రి మందలించి చెలుక వద్దకు వెళ్లాడు. దీనికి మనస్తాపం చెందిన మునీష ఈ నెల11వ తేదీన మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి నివారణ మందుతాగి ఆత్మహత్యకు యత్నించింది. చెలుక వద్ద నుంచి ఇంటికి చేరుకున్న కుటుంబీకులు అపస్మారక స్థితిలో ఉన్న మునీష చూసి చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఈ ఘటనపై తండ్రి యాకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు.

జాతీయ ఉద్యమంలో హిందీది కీలకపాత్ర

కేయూ క్యాంపస్: భారత జాతీయ ఉద్యమంలో హిందీభాష కీలకపాత్ర వహించిందని కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేష్ అన్నారు. గురువారం జాతీయ హిందీ దినోత్సవం సందర్భంగా హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జాతీయోద్యమంలో దేశం మొత్తాన్ని జాగృతం చేసి ఏకతాటిపై నడిపేందుకు హిందీభాష దోహదం చేసిందన్నారు. రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో హిందీని కేంద్ర ప్రభుత్వ అధికార భాషగా గుర్తిస్తూ పొందుపర్చారన్నారు. కళాశాల హిందీ విభాగం పూర్వ ఆచార్యులు సంజీవ, ప్రిన్సిపాల్ ఆచార్య బన్నఅయిలయ్య, అధ్యాపకురాలు రమాదేవి పాల్గొన్నారు.

లా పరీక్షలు షురూ..

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో మూడేళ్ల, ఐదేళ్ల లా కోర్సుల వివిధ సెమిస్టర్ల పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. హనుమకొండలోని మహిళా పీజీ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని వీసీ రమేష్, రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు, పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి సందర్శించారు. పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. వీరి వెంట రాధిక ఉన్నారు.

కేయూలో ఐదుగురు ఉద్యోగుల బదిలీ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను అంతర్గతంగా బదిలీలు చేస్తూ రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాస్‌రావు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. క్యాంపస్‌లోని యూనివర్సిటీ హాస్టళ్ల ఆఫీస్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న బి.వీరయ్యను సుబేదారిలో ఉమెన్స్ పీజీ కళాశాలకు బదిలీ చేశారు. ఆ మహిళా పీజీ కళాశాలలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న బి.ప్రభాకర్‌ను కేయూ ఇంజనీరింగ్ కళాశాలకు, క్యాంపస్‌లోని జియాలజీ విభాగంలో ల్యాబ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పి.నర్మదను కేయూ అడ్మినిస్ట్రేషన్ బ్రాంచ్‌కు, కేయూ అడ్మినిస్ట్రేషన్ బ్రాంచ్ టీఅండ్‌జీలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అబ్దుల్ ముజీబ్‌ను క్యాంపస్‌లోని యూనివర్సిటీ హాస్టల్స్‌కు.. సుబేదారిలోని యూనివర్సిటీ పీజీ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కె.విజయలక్ష్మిని యూనివర్సిటీ హాస్టల్స్‌కు బదిలీ చేస్తూ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీచేశారు.

చోరీ కేసులో మహిళ అరెస్ట్..

- సీసీ ఫుటేజీ సాయంతో నిందితురాలి గుర్తింపు
- 12గంటల్లోపే కేసు ఛేదించిన పోలీసులు

ఖిలా వరంగల్: ఓ మహిళ.. ఈజీగా డబ్బు సంపాదించాలని భావించింది. దీనికి చోరీలే మార్గమని నిర్ణయించుకుంది. అనుకున్నదే తడువుగా ఒంటరిగా ఉన్న వృద్ధురాలి ఇంట్లో చోరీకి పాల్పడింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు 12 గంటలు దాటక ముందే ఛేదించారు. మిల్స్ కాలనీ సీఐ సురేష్ గురువారం చోరీ వివరాలను వెల్లడించారు. వరంగల్ కరీమాబాద్ కుమ్మరివాడ సమీపంలో కాలనీకి చెందిన గొండె మమత(32) అద్దెకుంటూ ఇద్దరు పిల్లలతో కలిసి జీవనం సాగిస్తోంది. కుటుంబ కలహాలతో భర్తతో దూరంగా ఉంటోంది. అదేకాలనీలో ఒంటరిగా నివాసం ఉంటున్న వృద్ధురాలు మజ్జిగ వినోద ఇంటిపక్కనే అద్దెకు మమత ఉండేది. ఈ క్రమంలో వృద్ధురాలి బంగారు పుస్తెలు చోరీ చేయడానికి పథకం పన్నింది. దీంతో బుధవారం ఉదయం 5గంటలకే గడియ కొట్టి వృద్ధురాలిని పిలిచింది. నిద్ర నుంచి లేచి తలుపు తీసిన వృద్ధురాలి కళ్లలో కారం చల్లి మెడలోనున్న రెండున్నర తులాల బంగారు పుస్తెలు లాక్కొని పరారైంది. దీనిపై వృద్ధురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. దర్యాప్తులో భాగంగా సీసీ ఫుటేజీ ఆధారంగా చోరీకి పాల్పడింది గొండె మమతగా గుర్తించారు. గురువారం చోరీ చేసిన బంగారు పుస్తెలును విక్రయించేందుకు కరీమాబాద్ నుంచి వరంగల్‌కు వెళ్తోంది. దీంతో మమతను అరెస్ట్ చేసి పుస్తెలును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కాగా, 12 గంటల లోపే చోరీ కేసును ఛేదించడంతో వరంగల్ ఏసీపీ బోనాల కిషన్.. మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ సురేష్‌తోపాటు సిబ్బందిని అభినందించారు.

ఏజెన్సీకి ఫీవర్

గోదావరి పరీవాహక ప్రాంతంలో విజృంభిస్తున్న డెంగీ, విషజ్వరాలు

వర్షాలు, వరదలతో నిన్న మొన్నటి వరకు అవస్థలు • తిరిగి అవే ప్రాంతాల్లో మంచం పట్టిన జనం

సాక్షిప్రతినిధి, వరంగల్: జూలై ,ఆగస్టు మాసాల్లో కురిసిన ఎడతెరపి లేని వర్షాలు గోదావరి పరీవాహక ఏజెన్సీ పల్లెలను కుదిపేశాయి. ఇప్పుడా ప్రాంతాలను విషజ్వరాలు పట్టి పీడిస్తున్నాయి. కొమురమ్‌భీం ఆసిఫాబాద్ జిల్లా మొదలు భద్రాద్రి కొత్తగూడెం వరకు అనేక గ్రామాలు డెంగీ, మలేరియాల వలయంలో బిక్కుబిక్కుమంటున్నాయి. ఎంజీఎం ఆస్పత్రి పూర్వ వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల పేషెంట్లతో కిటకిటలాడుతోంది. ఆయా జిల్లా కేంద్రాల్లోని ఆస్పత్రులు జ్వరపీడితులతో నిండిపోతున్నాయి. ఇప్పటికే ఎనిమిదిమంది వృద్ధులు, మహిళలు, బాలురు మృత్యువాత పడగా, 15 నుంచి 25 రోజులైనా తగ్గని జ్వరాలతో జనం ఆందోళన చెందుతున్నారు.

ఇంటింటా జ్వరపీడితులే...

- వర్షాలు, వరదలతో అతలాకుతలమైన జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలు.. ఇప్పుడు డెంగీ, మలేరియా, విషజ్వరాలతో విలవిలలాడుతున్నాయి. మహా ముత్తారం, గణపురం, తాడిచర్ల, రేగొండ, కాటారం, మొగుళ్లపల్లి పీహెచ్‌సీల్లో రోజుకు 150 నుంచి 250 మంది ఔట్‌పేషెంట్లుగా వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు.
- ములుగు జిల్లా వెంకటాపురం, మంగపేట, వాజేడు, ఏటూరునాగారం మండలాల్లోని పల్లెలు మంచం పట్టాయి. జిల్లాలో గత జనవరి నుంచి 51 మలేరియా, 18 డెంగీ కేసులు నమోదయ్యాయి.
- పెద్దపల్లి జిల్లా మంథని, కమాన్‌పూర్, రామగిరి, ముత్తారం తదితర మండలాల్లోని 39 గ్రామాల్లో డెంగీ, విషజ్వరాలు జనాలను జడిపిస్తున్నాయి. ముత్తారం మండలంలో బేగంపేటకు చెందిన ఓ మహిళ మృతి చెందగా... డెంగీ బాధితుల సంఖ్య 89కి చేరినట్టు అధికారులు ప్రకటించారు.
- మహబూబాబాద్ జిల్లా గూడూరు, దంతాలపల్లి, మరిపెడ, కొత్తగూడ, గంగారం, కేసముద్రం, గార్ల తదితర మండలాల్లో డెంగీ, విషజ్వరాలు జడలు విప్పాయి.
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఏజెన్సీ ప్రాంతాల్లో మలేరియా, డెంగీ, విషజ్వరాలు జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు మలేరియా 162, డెంగీ 273, విషజ్వరాలు 2,35,835 కేసులు నమోదయ్యాయి.

ములుగు జిల్లాలో డెంగీతో నలుగురు మృతి

- వారికి దీర్ఘకాలిక వ్యాధులు కూడా ఉండటం వల్లేనంటున్న అధికారులు
- సీజనల్ వ్యాధులపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు సమీక్ష
- 24 గంటల కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ములుగు జిల్లాలో డెంగీతో నలుగురు మరణించారని ఆ జిల్లా వైద్యాధికారులు వెల్లడించారు. అయితే వారు గుండె జబ్బులు, ఊపిరితిత్తుల సమస్యలు, జాండిస్, సికిల్ సెల్ అనీమియా వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నట్టు వివరించారు. రాష్ట్రంలో కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పరిస్థితిపై గురువారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు, డీఎంఈ రమేశ్‌రెడ్డి, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలు, డీసీహెచ్‌లు, టీచింగ్ హాస్పిటళ్లు, జిల్లా దవాఖానల సూపరింటెండెంట్లు, ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా వైద్యాధికారులు డెంగీ మరణాలపై మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకొచ్చారు. వారం రోజుల్లోనే 10 మంది మరణించారంటూ కొందరు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ ఏడాది జూన్ నుంచి జిల్లాలో వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారని వెల్లడించారు.

జ్వరాల కోసం ప్రత్యేక ఓపీ కౌంటర్లు...

రాష్ట్రంలో అవసరమైతే జ్వరాల కోసం ప్రత్యేక ఓపీ కౌంటర్లు ఏర్పాటు చేయాలని మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. పిల్లల జ్వరాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్న అంశాలను మంత్రి వివరించారు. డెంగీ కేసులు పెరుగుతున్నట్టు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, ఫీవర్ కేసులు ఆందోళనకర స్థాయిలో లేవని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఒక్క మరణం కూడా నమోదు కాలేదన్నారు. జ్వర బాధితుల వివరాలను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని, ఆ డేటా ఆధారంగా డీఎంహెచ్‌వోలు హైరిస్క్ ఏరియాలను గుర్తించి జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాల్లో 24 గంటల కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు సమాచారం అందించాలని చెప్పారు. మీడియా సమావేశాలు నిర్వహించి సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. మలేరియా విభాగం అడిషనల్ డైరెక్టర్‌ను కొత్తగూడెం పంపి, అక్కడి పరిస్థితిని సమీక్షించాలని అధికారులను ఆదేశించారు.

ఏజెన్సీ ప్రాంతాల్లో విషజ్వరాలు

ఇద్దరు మహిళలు, డెంగీతో ఆరు నెలల పాప మృతి


రజని (ఫైల్) మనీష (ఫైల్) మినహ (ఫైల్)

వాజేడు/కన్నాయిగూడెం: ములుగు జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లో విషజ్వరాలు మరణ మృదంగం మోగిస్తున్నాయి. రెండు రోజుల్లోనే ఐదుగురు చనిపోయారు. బుధవారం ఇద్దరు చనిపోగా, గురువారం మరో ముగ్గురు మృతిచెందారు. మృతుల్లో ఆరు నెలల పాప ఉండడం గమనార్హం. ములుగు జిల్లా వాజేడు మండలం మొట్లగూడెం గ్రామానికి చెందిన కుర్సం రజని (35), ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్‌లో నివాసి మనీష (30) విషజ్వరంతో మృతిచెందారు. వాజేడు మండల పరిధిలోని దేవాదుల గ్రామానికి చెందిన ఆరు నెలల పాప కూడా డెంగీ జ్వరంతో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

ధాన్యం కొనుగోలుకు 54 టెండర్లు

- మొత్తం 25 లాట్లలో 8 లాట్లకు ఒక్కొక్కరే బిడ్డింగ్
- మిగతా 17 లాట్లకు 46 సంస్థల పోటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మిల్లుల్లో మూలుగుతున్న ధాన్యాన్ని గ్లోబల్ టెండర్ల ద్వారా విక్రయించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి మంచి స్పందన లభించింది. తొలి విడతగా 25 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ) ధాన్యాన్ని విక్రయించాలని భావించిన పౌరసరఫరాల సంస్థ ఈ మేరకు గత నెలలో టెండర్లను ఆహ్వానించింది. 25 ఎల్ఎంటీల ధాన్యాన్ని 25 లాట్లుగా విభజించి , ప్రతి ఎల్ఎంటీ ఒక లాట్‌గా ఆన్‌లైన్‌లో బిడ్స్ ఆహ్వానించింది. గురువారంతో గడువు ముగియగా, సాయంత్రం 5 గంటలకు అధికారులు టెక్నికల్ బిడ్లు తెరిచారు. 25 లాట్ల కోసం మొత్తం 54 సంస్థలు బిడ్లు దాఖలు చేశాయి. ఇందులో 8 లాట్లకు సంబంధించి కేవలం ఒక్కో బిడ్ మాత్రమే దాఖలైనట్లు విశ్వసనీయ సమాచారం. మిగతా 17 లాట్ల కోసం 46 సంస్థలు పోటీ పడ్డాయి.

యాసంగిలో 66.85 ఎల్ఎంటీల ధాన్యం సేకరణ

రాష్ట్ర వ్యాప్తంగా గత యాసంగి (2022–23)లో 66.85 ఎల్ఎంటీల ధాన్యాన్ని సేకరించారు. ఈ మొత్తం ధాన్యాన్ని మిల్లుల్లో నిల్వ చేయగా, అందులో కొంత భాగం అకాల వర్షాల కారణంగా తడిచిపోయింది. తడిచిన ధాన్యంతో పాటు మిగతా ధాన్యాన్ని కూడా ముడి బియ్యంగా మిల్లింగ్ చేసేందుకు మిల్లర్లు నిరాకరించారు. బాయిల్డ్ రైస్‌గా మాత్రమే ఇస్తామని చెప్పినా, కేంద్రం నిబంధనలతో అది సాధ్యం కాలేదు.

సినిమాల్లోని సీన్లపైనా నజర్

- డ్రగ్స్ వినియోగం ప్రేరేపించేలా ఉంటే చర్యలు
- ఇటీవల విడుదలైన 'బేబీ' సినిమా టీమ్‌కు నోటీసులు
- బాలీవుడ్‌పైనా దృష్టి పెట్టేలా ఎన్సీబీకి సమాచారం
- హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (టీఎస్–నాబ్) అధికారులు మాదాపూర్‌లోని విఠల్‌నగర్‌లో ఉన్న ఫ్రెష్ లివింగ్ అపార్ట్‌మెంట్‌లో గత నెల 31న జరిగిన ఓ డ్రగ్ పార్టీపై దాడి చేశారు. ఆ ఫ్లాట్‌లో కనిపించిన సీన్... ఇటీవల విడుదలైన 'బేబీ' సినిమాలోని సీన్లకు మధ్య సారూప్యత ఉందని హైదరాబాద్ పోలీసు కమిషనర్, టీఎస్ నాబ్ డైరెక్టర్ సీవీ ఆనంద్ అన్నారు. మాదకద్రవ్యాల వినియోగాన్ని ప్రేరేపించేలా ఉన్న ఆ సన్నివేశాలకు సంబంధించి చిత్ర యూనిట్‌కు నోటీసులు ఇచ్చామని, వారు తమ ఎదుట హాజరై వివరణ ఇచ్చారని గురువారం చెప్పారు. అందులో ఉన్న సీన్లపై తాము చెప్పిన తర్వాతే సినిమాలో వార్నింగ్ నోట్ పెట్టారని, అప్పటివరకు అలాంటిది కూడా లేదని అన్నారు. ఇలాంటి అభ్యంతరకరమైన సన్నివేశాలను సినిమాల్లో పెట్టవద్దని ఆనంద్ హితవు పలికారు. వీటి ద్వారా స్ఫూర్తి పొంది అనేక మంది యువకులు మాదకద్రవ్యాలకు బానిసలుగా మారే ప్రమాదం ఉందన్నారు. గతంలోనూ ఇలాంటి సీన్లతో కూడిన సినిమాలు వచ్చాయని, అయితే వాటిని ఎవరూ పట్టించుకోలేదని చెప్పిన ఆనంద్.. ఇకపై ఈ తరహాలో ఉన్న వాటిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 'టాలీవుడ్ లింకులు ఉన్న డ్రగ్స్ కేసు'లో పరారీలో ఉన్న సూర్య.. స్నార్ట్ అనే పేరుతో పబ్ నిర్వహిస్తున్నాడని, కొకైన్ వంటి మాదకద్రవ్యాలను స్నార్టింగ్ ప్రక్రియ ద్వారా వినియోగిస్తారని చెప్పారు. దీన్ని బట్టి సూర్య తన



వద్ద మాదకద్రవ్యాలు లభిస్తాయని అర్థం వచ్చేలా తన పబ్‌కు పేరు పెట్టాడని భావించాల్సి వస్తోందని ఆనంద్ వ్యాఖ్యానించారు. బాలీవుడ్ చిత్రాల్లోనూ డ్రగ్స్‌ను ప్రేరేపించే సీన్లు లేకుండా చూడాలని, ఉన్న వాటిపై చర్యలు తీసుకోవాలని నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరోను (ఎన్సీబీ) కోరతామన్నారు. ఎన్సీబీ గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా 14 కోట్ల మంది డ్రగ్స్ వినియోగదారులు ఉన్నారని, దీన్ని సీరియస్‌గా తీసుకున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని వివరించారు. తాము ఇటీవల కాలంలో 33 మంది నైజీరియన్లను అరెస్టు చేయగా, వారిలో 18 మంది బెంగళూరులో స్థిరపడిన వారిగా తేలిందన్నారు. టీఎస్ నాబ్ సేవల విస్తరణకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలని హైకోర్టును కోరతామని చెప్పారు.

టాలీవుడ్ తెరపై మరో డ్రగ్ మరక

▶ మొదటి పేజీ తరువాయి

బెంగళూరు డ్రగ్ పెడ్లర్స్‌తో సంబంధాలు ఏర్పడ్డాయి. దీంతో హైదరాబాద్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోని ఫామ్‌హౌస్‌లు, గెస్ట్ హౌస్‌ల్లో రేవ్ పార్టీలు ఏర్పాటు నిర్వహించేవాడు. స్నాప్‌చాట్‌లో గాడ్ హెడ్స్ పేరుతో ఐడీ క్రియేట్ చేసి దీని ద్వారా డ్రగ్స్ విక్రయిస్తున్నాడు. ఈ యాప్‌లో మెసేజ్ చదవగానే డిస్‌అప్పియర్ అయ్యే ఆప్షన్ ఉండటంతోపాటు కస్టమర్లకు ప్రత్యేక కోడ్‌లు ఇవ్వడం ద్వారా దందా సాగించాడు. గత నెల 31న ఇతడితోపాటు రమణారెడ్డి, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఐజీ వద్ద సీనియర్ స్టెనోగా పని చేస్తున్న డి.మురళిని అరెస్టు చేశారు. వీరిని విచారించడంతో ఈ డ్రగ్స్ మూలాలు బయటపడ్డాయి.

నైజీరియన్ల ద్వారా రామ్ కిషోర్‌కు...

బాలాజీ ముగ్గురు నైజీరియన్లతోపాటు నగరానికి చెందిన రామ్ కిషోర్ వైకుంఠం (పరారీలో ఉన్నాడు) నుంచి డ్రగ్స్ ఖరీదు చేసేవాడు. ప్రస్తుతం బెంగళూరులో ఉంటున్న నైజీరియన్లు అమోబీ చికోడి మొనగాలు, ఇక్బావే మైకేల్, థామస్ అనఘకాలు నుంచి బాలాజీకి కొకైన్, ఎండీఎంఏ, ఎక్స్‌టసీ అందుతున్నాయి. డ్రగ్ పార్టీల నిర్వహణకు బాలాజీకి రమణా రెడ్డి ఫైనాన్స్ చేస్తుండేవాడు. ఇతడికి బ్యాంక్ ఆఫ్ అమెరికాలో ఖాతా ఉంది. ఇందులో ప్రస్తుతం రూ.5.5 కోట్ల బ్యాలెన్స్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతోపాటు రమణారెడ్డి, బాలాజీలకు ఉన్న ఆస్తుల వివరాలు సేకరిస్తున్నారు. వీటిని స్వాధీనం చేసుకోవడానికి కసరత్తు చేస్తున్నారు. బాలాజీ నుంచి డ్రగ్స్ ఖరీదు చేసిన 18 మంది కస్టమర్లలో సినీ రంగానికి చెందిన వారితోపాటు పబ్‌లు, స్నూకర్ పార్లర్ల నిర్వాహకులు ఉన్నారు. హైటెక్ సిటీ ప్రాంతంలో స్నార్ట్ పబ్ నిర్వహించే సూర్య, జూబ్లీహిల్స్‌లో టెర్రా కేఫ్ అండ్ బిస్ట్రో నిర్వహించే అర్జున్, గుంటూరులో స్నూకర్ పార్లర్ నిర్వహించే పీఎస్ కృష్ణ ప్రణీత్ కీలకం. వీరు తమ సంస్థల్లోనే రహస్య గదులు ఏర్పాటుచేసి డ్రగ్స్ వినియోగానికి సహకరిస్తూ విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

ఫోన్లు ఆఫ్ చేసుకున్న నవ్‌దీప్, రవి

బాలాజీ నుంచి డ్రగ్స్ ఖరీదు చేసి వినియోగిస్తున్న వారిలో సినీ రంగానికి చెందిన వారూ ఉన్నట్లు టీఎస్ నాబ్ గుర్తించింది. హీరో నవదీప్, షాడో, రైడ్ చిత్రాల నిర్మాత రవి ఉప్పలపాటి, మోడల్ శ్వేత, మాజీ ఎంపీ దేవరకొండ విఠల్‌రావ్ కుమారుడు సురేశ్ రావ్, ఇంద్రతేజ్, కార్తీక్‌లతోపాటు కలహర్‌రెడ్డి ఉన్నారు. తెలంగాణ ఎమ్మెల్యేలు బెంగళూరులో జరిగిన డ్రగ్ పార్టీకి హాజరయ్యారనే విషయం 2021లో వెలుగులోకి వచ్చి కలకలం సృష్టించింది. ఈ పార్టీ నిర్వాహకుడు కలహర్‌రెడ్డే కావడం గమనార్హం. మరోపక్క ఎక్సైజ్ అధికారులు దర్యాప్తు చేసిన 2017 నాటి టాలీవుడ్ డ్రగ్స్ కేసులోనూ నవదీప్ పేరు ఉంది. నిందితుల కోసం ఏసీపీ కె.నర్సింగ్‌రావు, ఇన్‌స్పెక్టర్ పి.రాజేష్, కానిస్టేబుల్ సత్యనారాయణ తదితరుల బృందం గాలించింది. అమోబీ చికోడి, ఇక్బావే మైకేల్, థామస్‌తోపాటు సురేశ్ రావ్, కొల్లి రామ్‌చంద్, కూరపాటి సందీప్, అనుగు సుశాంత్ రెడ్డి, కృష్ణ ప్రణీత్‌లను పట్టుకుంది. రూ.10 లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకుంది. నవదీప్, రవి ఉప్పలపాటి ఫోన్లు ఆఫ్ చేసుకుని, కుటుంబంతో పరారయ్యారు.

కాజీపేట దర్గాకు భక్తజనం


దర్గాపై ఖుస్రూపాషాతో కలిసి గిలాఫ్, చాదర్ సమర్పిస్తున్న వినయ్‌భాస్కర్


ప్రార్థన చేస్తున్న వరంగల్ పోలీసు కమిషనర్ రంగనాథ్, కలెక్టర్ సిక్తాపట్నాయక్

- పలు రాష్ట్రాల నుంచి రాక
- నేడు ఉత్సవాల ముగింపు

కాజీపేట రూరల్: కాజీపేట హజరత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబాని దర్గా ఉత్సవాలకు వివిధ రాష్ట్రాల నుంచి వివిధ దర్గాల పీఠాధిపతులు, ముస్లిం భక్తులు, మహిళలు, యువతులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దర్గా ఉత్సవాల్లో రెండో రోజు గురువారం భక్తులు మతాలకతీతంగా పెద్ద సంఖ్యలో చేరుకొని మొక్కులు, కానుకలు సమర్పించి వేడుకున్నారు. దర్గా వద్ద పూలు, చాదర్లు సమర్పించి ప్రార్థనలు చేసుకున్నారు. భక్తుల తాకిడితో దర్గా ప్రాంగణం జన సంద్రంగా మారింది. ప్రజాప్రతినిధులు, అధికారులకు దర్గా పీఠాధిపతి ఖుస్రూపాషా, భక్తియార్ బియాబాని, ముస్లిం మత పెద్దలు ముస్లిం సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. శుక్రవారం దర్గా ఉత్సవాలు బదావాతో ముగియనున్నాయి. ఇదిలా ఉండగా.. హనుమకొండ బాలసముద్రంలోని క్యాంప్ కార్యాలయం నుంచి ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ కాజీపేట దర్గాకు చేరుకున్నారు. దర్గా పై గిలాఫ్, చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తెలంగాణ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ మహ్మద్ ఇంతియాజ్, తెలంగాణ స్టేట్ ఖాదీ గ్రామోద్యోగ చైర్మన్ యూసుఫ్ జహీద్‌సాహేబ్ ఉన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్, కలెక్టర్ సిక్తా పట్నాయక్, వరంగల్ పోలీసు కమిషనర్ రంగనాథ్ కాజీపేట దర్గాను దర్శించుకున్నారు.


దుకాణంలో కొనుగోలు చేస్తున్న మహిళలు

సుస్థిర నగరాల దిశగా సాగాలి

- సదస్సులో మేయర్, కమిషనర్


సదస్సులో మేయర్ సుధారాణి, కమిషనర్ బాషా

వరంగల్ అర్బన్: హైదరాబాద్‌లోని మారియట్ హోటల్‌లో గురువారం జరిగిన అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమ్మిట్– 'సుస్థిర నగరాలను ఊహించడం, నిర్మించడం' అంశంపై సదస్సు నిర్వహించారు. ఇందులో మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా హాజరయ్యారు. యూఎస్ కాన్సుల్ జనరల్ రెబెకా డ్రామే, ఫీనిక్స్ వ్యవస్థాపక చైర్మన్ చుక్కపల్లి సురేశ్, ఐఆర్ఏఎస్ మేనేజింగ్ డైరెక్టర్, హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ఎన్వీఎస్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర విపత్తు డైరెక్టర్ జనరల్ వై.నాగిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నగరాన్ని స్థిరమైన స్వర్గధామంగా మార్చేందుకు దోహదపడే ఇన్నోవేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్‌లు, టెక్నాలజీ ఆధారిత పరిష్కారాలు, కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్, పాలసీ ఫ్రేమ్‌వర్క్‌లు, పెట్టుబడి అవకాశాలపై చర్చించినట్లు మేయర్, కమిషనర్ వెల్లడించారు.

ఫీజులకు.. వసతులకు ముడిపెట్టొద్దు

- వ్యాపారం చేసినందుకు పన్నులు చెల్లించాలి
- పార్కింగ్‌ను ఏర్పాటు చేయాలని వ్యాపారుల డిమాండ్


సమావేశంలో పాల్గొన్న మార్కెట్ అధికారులు

వరంగల్: వరంగల్ లక్ష్మీపురం మోడల్ కూరగాయల మార్కెట్‌లో వసతులు లేవంటూ మార్కెట్ ఫీజులు పెండింగ్‌లో పెడితే చర్యలు తప్పవని జిల్లా మార్కెటింగ్ అధికారి పి.ప్రసాదరావు అన్నారు. గురువారం లక్ష్మీపురం మార్కెట్‌లోని టీఎన్జీవోస్ భవనంలో మార్కెట్ ఫీజుల బకాయిలు, తైబజార్ చెల్లింపుల నమోదుపై మార్కెట్ కార్యదర్శి బీవీ.రాహుల్ ఆధ్వర్యంలో కమీషన్ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ.. మార్కెట్‌లో వ్యాపారం చేసే ప్రతి వ్యాపారస్తుడు మార్కెట్ కమిటీకి మార్కెట్ ఫీజులు సకాలంలో చెల్లించాలని లేకుంటే వారి లైసెన్సులు సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. మోడల్ మార్కెట్‌లో వసతుల కల్పన కోసం మార్కెటింగ్‌శాఖ ఇంజనీర్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యదర్శి రాహుల్ మాట్లాడుతూ మడిగెల అద్దెలు, మార్కెట్ ఫీజులు బకాయిలు పెండింగ్ పెడితే సంబంధిత వ్యాపారుల లైసెన్సులను రద్దు చేసేందుకు ఉన్నత అధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. అదే విధంగా మార్కెట్‌లో టెండర్‌ను నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. కమీషన్ వ్యాపారులు మాట్లాడుతూ మార్కెట్ బయట కూరగాయలు హోల్‌సేల్‌గా రిటైల్ అమ్మకాలను కట్టడి చేయాలన్నారు. కూరగాయల మార్కెట్‌లో పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలని వ్యాపారులు డిమాండ్ చేశారు. కమీషన్ లైసెన్సులు ఉన్న వారి వద్దనే రిటైల్ వ్యాపారులు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మార్కెట్‌లో పశువులు స్వైరవిహారం చేస్తున్నాయని, వాటి వల్ల వ్యాపారులకు, వినియోగదారులకు ప్రమాదం పొంచి ఉందని వ్యాపారి గులాం అఫ్జల్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో గ్రేడ్–2 కార్యదర్శులు బియాబానీ, ఎస్.రాము, సూపర్‌వైజర్లు కృష్ణ, వెంకన్న నాయక్, కమీషన్ వ్యాపారులు జారతీ శ్రీనివాస్, బి.శ్రీను, బాబూరావు, బేతి అశోక్, రాజు, యుగంధర్, రవీందర్‌రావు, రవి, బొల్లం రాజు పాల్గొన్నారు.

వీసీ బేషరతుగా రాజీనామా చేయాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్


దీక్షలను విరమింపజేస్తున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

కేయూ క్యాంపస్: పీహెచ్‌డీ అవకతవకలపై ప్రశ్నించినందుకు పోలీసులతో దాడి చేయించిన వీసీ బేషరతుగా రాజీనామా చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. కేయూలో వీసీ, రిజిస్ట్రార్లను భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన దీక్షలు గురువారంతో 9వ రోజుకు చేరుకున్నాయి. శిబిరాన్ని శ్రీనివాస్‌గౌడ్ సందర్శించి గాయపడిన విద్యార్థి నాయకులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ భజనపరులైన పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మల్లారెడ్డిల ప్రైవేట్ యూనివర్సిటీలు బాగుపడేందుకు ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. వీసీ రిజిస్ట్రార్‌లను భర్తరఫ్ చేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. అనంతరం శ్రీనివాస్‌గౌడ్.. విద్యార్థి జేఏసీ నాయకులకు నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. పీహెచ్‌డీ రెండో కేటగిరీ అవకతవకలకు సంబంధించిన వ్యవహారంలో వీసీ రమేష్‌ను తప్పించకుంటే జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలపై పోరాటం చేస్తామని కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి జేఏసీ వెల్లడించింది. విద్యార్థుల దీక్షకు బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వల్లకొండ వేణుగోపాల్, బాధ్యులు దాడి మల్లయ్య, రిటైర్డ్ ప్రొఫెసర్ గాదె దయాకర్, బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, కార్పొరేటర్ గురుమూర్తి సంఘీభావం తెలిపారు. కేయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ ఇట్టబోయిన తిరుపతియాదవ్, బి.నర్సింహారావు, మేడ రంజిత్‌కుమార్, ఎండీ పాషా, కేతికప్రసాద్, గుండెగ సుమన్, మంద వీరస్వామి, కాయిత నాగరాజు, నాగరాజు, మాచర్ల రాంబాబు ,అంకెళ్ల శంకర్, మట్టెడకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన నిరుద్యోగ యువతులకు వివిధ రంగాల్లో శిక్షణ

ఏటూరునాగారం: గిరిజన నిరుద్యోగ యువతులకు సువర్ణ అవకాశం కల్పిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ అంకిత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతులకు హైదరాబాద్‌లోని 'నిర్మాణ్' సంస్థ ద్వారా ములుగు జిల్లా కేంద్ర పరిధిలోని జాకారం యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో రెండు నెలలు వెబ్ మొబైల్ అప్లికేషన్స్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపారు. శిక్షణ అనంతరం సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఐటీడీఏ ద్వారా వసతి, భోజనం, కంప్యూటర్, నెట్, శిక్షణ మెటీరియల్ అందజేస్తామన్నారు. 18 నుంచి 30 సంవత్సరాల లోపు ఉన్న గిరిజన నిరుద్యోగ యువతులు ఏదైనా డిగ్రీ, పీజీ ఉత్తీర్ణత పొంది ఉండాలన్నారు. ఈనెల 21వ తేదీన తమ సర్టిఫికెట్లతో జాకారంలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని పీఓ కోరారు.

దేశ జీవన గమనంలో ఆదివాసీలు కీలకం


సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

ఎస్ఎస్ తాడ్వాయి : మండల కేంద్రం కామారంలోని సమ్మక్క, సారలమ్మ ఆర్కియాలజీ – ఇండిజీనస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌ను యునైటెడ్ నేషన్స్ డిక్లరేషన్ ఆన్ ద రైట్ ఆఫ్ ఇండిజీనస్ పీపుల్స్ బృందానికి సంబంధించిన 18 రాష్ట్రాల ప్రతినిధుల బృందం గురువారం సందర్శించింది. ఈ పర్యటనకు వచ్చిన ప్రతినిధులను రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ కాక నర్సింగ రావు, డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా బృంద ప్రతినిధి ఈక సునీల్ మాట్లాడుతూ దేశ జీవన గమనంలో ఆదివాసీలు కీలకమని, నేడు వారికి కనీస విలువ లేదన్నారు. ఆగస్టు 9వ తేదీని ఆదివాసీ దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించినా దేశంలో ఏ ప్రాంతంలో కూడా అధికారికంగా నిర్వహించకపోవడం దారుణమన్నారు. రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్, పీసా చట్టాలు దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పలు రకాలుగా అమలవుతున్నాయన్నారు. అన్ని రాష్ట్రాల్లో ఒకేలా అమలు కావడానికి అందరం కృషి చేయాలన్నారు. సమావేశంలో అంతర్‌రాష్ట్ర ప్రతినిధులు, సెంటర్ కోఆర్డినేటర్ ఇర్స స్వామి, బృందం ఇన్‌చార్జ్ పాయం రాజేందర్, బిరస ముండా ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు కొర్నిబెల్లి భుజంగరావు, పెద్దమనిషి బెల్లి ఆదినారాయణ, కొర్నెబెల్లి వంశీ, గొంది శేఖర్, పాయం నందిని, పాయం అంజలి, తదితరులు పాల్గొన్నారు.

ప్లాటినం జూబ్లీ ఉత్సవాలకు ఆహ్వానం


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన చాంబర్ ప్రతినిధులు

వరంగల్: వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్లాటినం జూబ్లీ ఉత్సవాలకు హాజరు కావాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్‌ను చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి ఆహ్వానించారు. వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో మంత్రులను కలసి పుష్పగుచ్ఛాలు అందించి సన్మానించారు. రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 30న ఉత్సవాలు ప్రారంభమవుతాయని, అక్టోబర్ 1తో ముగుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో చాంబర్ మాజీ అధ్యక్షుడు కటకం పెంటయ్య, అడితి సెక్షన్ అధ్యక్షుడు ఎస్‌రెడ్డి లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'విజయ భేరి'ని విజయవంతం చేయాలి

- ఏఐసీసీ పరిశీలకుడు రవీంద్ర ఉత్తమరావు దళ్వి


మాట్లాడుతున్న ఉత్తమ రావు దళ్వి

హన్మకొండ చౌరస్తా: ఈనెల 17న తుక్కుగూడలో నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ విజయభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని ఏఐసీసీ పరిశీలకుడు, వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ రవీంద్ర ఉత్తమరావు దళ్వి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. హనుమకొండలోని డీసీసీ భవన్‌లో గురువారం సాయంత్రం వర్ధన్నపేట నియోజకవర్గ సమీక్ష నిర్వహించారు. విజయభేరి సభకు నియోజకవర్గాల నుంచి జన సమీకరణ చేయాలని, తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ మొదటిసారి హైదరాబాద్‌కు రానుందన్నారు. సమావేశంలో టీపీసీసీ అధ్యక్షురాలు బంద్రు శోభారాణి, హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు నాయిని రాజేందర్ రెడ్డి, ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, నాయకులు నమిండ్ల శ్రీనివాస్, బందెల రాజభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో గంజాయి స్మోకర్లు

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేటలో ఓ పాత ఇంటిని అడ్డాగా చేసుకుని గంజాయి తాగుతున్న ఆరుగురు యువకులను గురువారం మధ్యాహ్నం మిల్స్ కాలనీ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. వారినుంచి గంజాయి నింపిన సిగరెట్స్ లభించినట్లు సమాచారం. మరో వ్యక్తి పోలీసుల రాకను గమనించి గంజాయి ప్యాకెట్ విసిరేసి ఆటో దిగి పారిపోయినట్లు తెలిసింది. పట్టుబడిన యువకులను విచారించగా శంభునిపేటలోని ఓ పాత ఇంటిని కేంద్రంగా చేసుకుని గంజాయి సేవిస్తున్నట్లు వెల్లడించినట్లు విశ్వసనీయ సమాచారం.